క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకాలు


స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వ పత్రాలతో..ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఎంఈవో-1గా దివాకరరావు బాధ్యతల స్వీకరణ



పరవాడ: మండల విద్యాశాఖాధికారి-వన్‌గా ఎం.దివాకరావువు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అరకు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేశారు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో పరవాడ ఎంఈవో-వన్‌గా వచ్చారు. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత శరణ్‌కుమార్

పరవాడ: మండలంలోని పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ బోయిమాంబ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన దివంగత బండారు సంతయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బండారు శరణ్‌కుమార్ దంపతులు రూ. 50,116 విరాళం ఇచ్చారు. ఆలయ నిర్వాహకులకు సంబంధిత నగదు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బండారు బోయన్న, పైల అప్పారావు, కప్పరాడ శ్రీను, కూండ్రపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశేషంగా అన్న సమారాధన


అన్న సమారాధన నిర్వహిస్తున్న రెడ్డి నారాయణ తదితరులు

సింహాచలం: గురుపౌర్ణమి పురస్కరించుకుని పెందుర్తి మండలం రాంపురంలో సనాతన రుషి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్న సమారాధ నిర్వహించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శాకంబరిగా కుంచుమాంబ


శాకంబరిదేవి అలంకరణలో కుంచుమాంబ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూ ర్మన్నపాలెం కుంచుమాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకంబరిదేవిగా సోమవారం అలంకరించారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో సుమారు 58 రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేకువజాము నుంచి భక్తులు శాకంబరిగా అలంకరించిన కుంచుమాంబను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నారా యణ, వసంత దంపతులు, లేళ్ల కోటేశ్వరరావు, పద్మజ దంపతులు, దామోదర్‌రెడ్డి, ధన దంపతు లు, శ్రీరామ్మూర్తి, సునీత, భవానీ, లలిత జ్యోతిర్మయి, వరలక్ష్మి, త్రిమూర్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ స్ఫూర్తి.. సేవా దీప్తి

- భక్తులకు నిరంతరాయంగా సేవలు
- 24 గంటలు కొనసాగిన వైద్యశిబిరాలు
- సింహగిరిపై భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసుల చర్యలు


సింహగిరిపై లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ


ఆహార పదార్థాలు అందజేస్తున్న ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత కృష్ణారెడ్డి

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణ స్ఫూర్తితో భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు.. అసోషియేషన్లు విశేష సేవలందించాయి. ప్రదక్షిణ ప్రారంభమైన ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ భక్తుల సేవలో తరించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు, ఆలయ ప్రదక్షిణ చేసి వారికి అల్పాహారం నుంచి అన్నపానీయాలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యులతో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాయి.పోలీసులు, జీవీఎంసీ, దేవస్థానం అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

- సింహగిరి ఆలయ బస్టాండ్‌లో సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు బంటుబిల్లి మహేష్ ఆధ్వర్యంలో భక్తులకు పొంగలి పంపిణీ చేశారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.
- ఆలయ దక్షిణరాజగోపురం మార్గంలో ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌కాంత్ నాయక్‌దాస్ శిష్యబృందం పొంగలి ప్రసాదం విరివిగా అందజేసింది.
- సింహగిరిపై అన్నదాన భవనంలో భక్తులందరికీ దద్దోజనం, కదంబం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.
- కొండదిగువన ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపం అధినేత కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇడ్లి, తదితర ఆహార పదార్థాలు, టీ, మజ్జిగ అందజేశారు.
- 98వవార్డు పద్మావతినగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఇడ్లీ, ఉప్మా, పంపిణీ చేశారు.
- గిరిప్రదక్షిణ పూర్తి చేసి సింహగిరి వచ్చిన భక్తులకు అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరి పైన, కొండదిగువన వైద్య సదుపాయం అందజేశారు.

రద్దీని నియంత్రించేందుకు పోలీసుల చర్యలు

సింహగిరిపై దర్శనానంతరం ఆర్టీసీ బస్సుల్లో తిరిగి వెళ్లే భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రం ఎదురుగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఆ గ్యాలరీల్లో భక్తులను ఉంచి ఆర్టీసీ బస్ రాగానే ఒక్కో గ్యాలరీలోని భక్తులను బస్సులు ఎక్కించారు.భక్తుల మధ్య తోపులాటను నియంత్రించారు.


కొండదిగువ బస్టాండ్‌లో సేవలందిస్తున్న అడవివరం ఆరోగ్య కేంద్రం సిబ్బంది


పద్మావతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


సింహగిరిపై భక్తులకు ప్రసాదం అందజేస్తున్న దేవస్థానం అధికారులు

జగనన్న సురక్షతో ఉచిత సేవలు


ఆరిపాక సచివాలయంలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: అర్హత ఉన్నా పలు సాంకేతిక సమస్యలు,ధ్రువీకరణ పత్రాల సమస్యలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారి సమస్యలను జగనన్న సురక్ష ద్వారా పరిష్కరించనున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. మండలంలోని ఆరిపాక,బంగారమ్మపాలెం గ్రామ సచివాలయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి అర్హత ఉన్న వారిని గుర్తించడంతో వారికి పారదర్శకంగా ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలు ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. పలువురి లబ్ధిదారులకు ఆయన చేతులమీదుగా కుల, ఆదాయ ధ్రువ పత్రాలు అందజేశారు.

గతంలో టీడీపీ వారికే..

టీడీపీ ప్రభుత్వంలో వారి పార్టీ కండువా కప్పుకున్నవారికి.. సానుభూతి పరులకే పథకాలు అందించేవారిని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ విమర్శించారు. నేడు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తుందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఇంటికే పథకాలు అందించి చరిత్ర సృష్టించారన్నారు. అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ,రైతు భరోసా,చేయూత, పింఛన్లు వంటి సంక్షేమ పథకాలకు వలంటీర్లు ద్వారా ఇంటింటికీ వెళ్లి గుర్తించిలబ్ధి చేకూరుస్తున్నామన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు,క్రిమి సంహారక మందులను రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జగనన్న సురక్ష కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము,పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ,ఆరిపాక, బంగారమ్మపాలెం, రాయపుర అగ్రహారం సర్పంచ్‌లు పాలిశెట్టి పార్వతి, దాడి లావణ్య, పిల్లల అప్పలనాయుడు, బంగారమ్మపాలెం ఎంపీటీసీ రాపేటి అరుణ, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,రాపేటి రాము,శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి


సబ్బవరంలో పూజలందుకున్న సాయిబాబా


సాయినాథుడు

సబ్బవరం: గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం సబ్బవరంతో పాటు ఆరిపాక, గొటివాడ,దేవీపురం,వెదుళ్లనరవ శివారు కొత్తూరు తదితర గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచి హోమాలు,పూర్ణాహుతి కార్యక్రమాలు,అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆయా ఆలయాల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భజనలు,పల్లకీ సేవ,సంధ్యాహారతి కార్యక్రమాలను నిర్వహించారు.

అడవివరంలో..

సింహాచలం: గురు పౌర్ణమి పూజలను అడవివరం విజినిగిరిపాలెంలోని సాయినాథుడి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాయినాథుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రాయితీ వరివిత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న యడ్ల నాయుడు తదితరులు

సబ్బవరం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు అన్నారు. మండలంలోని గుల్లేపల్లి సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో రాయితీపై వరి విత్తనాలను ఆయన చేతులమీదుగా సోమవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అందించే వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోను గంగునాయుడు,బండారు శ్రీను,బుదిరెడ్ల కనకరాజు,వ్యవసాయ సహాయకులు హేమలత,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జీవనం అలవర్చుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ప్లాస్టిక్‌రహిత జీవనాన్ని అలవరచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ బ్యాగ్ డేని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడాలి-చేతి సంచులను వినియోగించాలి'అనే నినాదంతో తయారు చేసిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి విద్యార్థి చక్కని సందేశాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్లాస్టిక్‌పై నిషేధం విధించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించారని, దీనిని ప్రజలంతా పాటించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గుర్తించాలని, భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, డాక్టర్ బి.ప్రవీణ, డాక్టర్ వి.వి.వి ప్రకాష్, డాక్టర్ కె.రాము, డాక్టర్ రాజు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రీజాయినింగ్


విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చుకునే కార్యక్రమం ప్రారంభమైంది. 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చుకున్నారు. వీరికి ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరయ్యే అవకాశం కల్పించారు. సోమవారం డీఈవో ఎల్.చంద్రకళ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను వీరికి అందించారు. ఫెయిలైన విద్యార్థులకు సైతం ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాలతో విశాఖ ఉక్కును కాపాడుకుంటాం


872వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును కార్మికులందరు తమ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 872వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని కొనియాడారు. నేటి పాలకులు మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక


జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ సుభాష్ పార్థీకి స్వాగతం పలుకుతున్న భెల్ జై భీమ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: నగరానికి విచ్చేసిన నేషనల్ ఎస్సీ కమీషన్ చైర్మన్ సుభాష్ పార్థీకి భెల్(హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(జై భీమ్) ప్రతినిధులు విశాఖ విమానాశ్రయంలో సోమవారం సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందించారు. కమిషన్ చైర్మన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సమస్యలపై విన్నవించుకునేందుకు ప్రత్యేక సమయం కేటాయించినట్టు తెలిపారు. ఆ సమావేశంలో జై భీమ్ ప్యానల్ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని కమిషన్ చైర్మన్‌ను అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జై భీమ్ ప్యానల్ అధ్యక్షుడు రవి కిషోర్, ప్రధాన కార్యదర్శి జె.రాము, కార్యనిర్వాహక అధ్యక్షుడు హెచ్.భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

చార్జీల పెంపు ప్రతిపాదన తగదు


ధర్నాలోమాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న కార్మికులకు విద్యుత్ చార్జీలు పెంచాలని యాజమాన్యం చేస్తున్న ప్రతిపాదన విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఉన్న చార్జీలను అమాంతం పెంచేందుకు రంగం సిద్ధం చేయడం దుర్మార్గమన్నారు. కనీస నివాస యోగ్యం కాని క్వార్టర్స్‌లో ఉంటున్న కార్మికులపై భారం మోపడం సరికాదన్నారు. ఐఎన్‌టీయూసీతో చేసుకున్న ఒప్పందం వల్ల క్వార్టర్స్ ఖాళీ చేస్తే హెచ్ఆర్ఏ పొందే అవకాశాన్ని కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, ఉక్కు హౌస్, స్కూల్ ఫీజులు పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ గుర్తింపు యూనియన్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయండి


సీసీపీ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింహాచలం: అడవివరంలోని పాత గోశాల జంక్షన్ నుంచి తొలిపావంచా వరకు ఉన్న బీఆర్‌టీఎస్ బాధితులకు సరైన న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వారు సోమవారం జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణకు తామంతా జీవీఎంసీకి సహకరించామని తెలియజేశారు. నష్టపరిహారం కింద రెండు టీడీఆర్‌లు ఇచ్చారని, మరో రెండు టీడీఆర్‌లు ఇవ్వాలని కోరారు. అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల జంక్షన్ వరకు ఒకే విధమైన ప్యాకేజీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సునీత తెలిపారు. సీసీపీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, బీఆర్‌టీఎస్ బాధితులు అక్కిరెడ్డి అప్పారావు, గంద్రెడ్డి కొండల రావు, గంట్ల కిరణ్, తిరుమల రెడ్డి, సుధీర్, పోలరాసి స్వరూప్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని ఆందోళన


పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగిన నిర్వాసిత కార్మికులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ప్రత్యేక ఆర్థిక మండలిలోని అర్హి పరిశ్రమలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు సోమవారం పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు భూములు, ఇళ్లు ఇచ్చి ఉపాధి కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. నిర్వాసితులకు ఆర్ కార్డులు మంజూరు చేసినా ప్రయోజనం లేకుండా పోతుందని గనిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతామని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు ప్రసాద్ హెచ్చరించారు.

చర్చలు సఫలం ..అనంతరం కార్మిక నాయకులు, యాజమాన్య ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. నిర్వాసిత కార్మికులను పర్మినెంట్ చేసి విధుల్లోకి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సిరపరపు సురేష్ బందోబస్తు నిర్వహించారు. చర్చల్లో కార్మిక నాయకులు ఇల్లపు వాసు, బొద్దపు చిన్నారావు, బి.రామగోవిందరావు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్యాంటీన్లపై చర్యలకు వినతి


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ప్రైవేటు క్యాంటీన్ల ప్రక్షాళనకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. సోమవారం డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండేను కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంటీన్ భోజనంలో నాణ్యతలేని ఆహారంతో ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. క్యాంటీన్లు మురికి వాతావరణంలో నడుస్తున్నాయన్నారు. పనిచేయని సీలింగ్ ఫ్యాన్లు, దుర్గంధభరిత వాష్‌బేసిన్లు, తాగేందుకు మంచి నీరు కూడా అందుబాటులో ఉండని పరిస్థితని ఆవేదన వ్యక్తం చేశబూరు. ప్రైవేట్ క్యాంటీన్లలో నాణ్యత లేని టీ పొడర్ వినియోగిస్తున్నా, ప్రైవేట్ ఫ్రూట్ జ్యూస్ షాపులు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించి ఉద్యోగుల్ని లూటీ చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వీటిపై అధ్యయనానికి యూనియన్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, ప్రభాకరరెడ్డి, జి.వి. సుబ్బయ్య, బీఎంకే నాయక్, సుదర్శనం, నగేష్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

ఐఐపీఈ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన 31 మంది విద్యార్థులు జూన్ 15 నుంచి 28 వరకు పూణేలోని ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీలో నిర్వహించిన 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ పెట్రోలియం ఇంజనీరింగ్' నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జియో కెమిస్ట్రీ, ఆఫ్‌షోర్, నేచురల్ గ్యాస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఆలయంలో చండీ హోమం

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో సోమవారం మహా దుర్గ అమ్మవారికి సప్తశతి చండీ హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగిన హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహాదుర్గ అమ్మవారికి వేకువజామున అర్చనలు చేశారు.